# వింత వృక్షం

## వసుంధర

"ఏమండీ!" అంది శారద.

"ఊఁ" అన్నాడు రఘు.

"నేను మిమ్మల్ని మనసారా ప్రేమించాను. మీకోసం కన్న తండ్రిని ఎదిరించాను. లక్షల ఆస్తిని తృణ ప్రాయంగా చూశాను. ఆఖరికి మన ప్రేమ గెలిచి మన వివాహం జరిగింది. కానీ...." అని ఆగింది శారద.

"చెప్పు...." అన్నాడు రఘు.

"మీరు కూడా నన్నలాగే ప్రేమించాలని కోరుకుంటున్నాను—" అంది శారద.

రఘు నవ్వి—"అది నువ్వు నన్ను వేరే అడగాలా—జామచెట్టు జామకాయ కాయడం ఎంత సహజమో—నేను నిన్ను ప్రేమించడమూ అంత సహజం—" అన్నాడు.

"కానీ చెట్టు కాసిన కాయలు ఒక్కనికే దక్కవు. ఎందరో వాటిని పంచుకుంటారు—" అంది శారద.

"అంటే?"

"మీ ప్రేమ నాకు మాత్రమే పరిమితం కావాలి. కలలో కూడా మీరు మరో స్త్రీ గురించి తలవకూడదు. అది నేను సహించలేను. భరించలేను—" అంది శారద.

"మై గాడ్—నీ కసలు అలాంటి అనుమానం ఎందు కొచ్చింది?" అన్నాడు రఘు.

"మన సెప్పుడూ ప్రేమించిన వారినే అంటిపెట్టుకుని ఉంటుందని మీకు తెలుసుగదా!"

"ఊఁ"

"అలా అంటిపెట్టుకున్న మనసు నాకేమని చెప్పిందో తెలుసా?"

"చెప్పు!"

"నిన్న మీరు ఒక స్త్రీని దగ్గరగా లాక్కుని ముద్దు పెట్టుకున్నారని!"

"వాట్!" ఉలిక్కిపడ్డాడు రఘు.

"ఇది మీరు కాదనలేని నిజం!" అంది శారద.

రఘు ముఖం గంభీరంగా అయిపోయింది—"నేను నిన్ను ప్రేమిస్తున్నానని నీకు నమ్మకమేనా?"

"ఊఁ"

"అయితే నా మనసు కూడా నిన్నంటిపెట్టుకునే ఉంటుంది కదా!" అన్నాడు రఘు.

"ఉండాలన్నది నా కోరిక!" అంది శారద.

"అలా అంటిపెట్టుకున్న నా మనసేం చెప్పిందో తెలుసా?" అన్నాడు రఘు.

"చెప్పండి!" అంది శారద.

"నువ్వొక పరాయి పురుషుడిని బలంగా కౌగ లించుకుని ముద్దు పెట్టుకున్నావని—" అన్నాడు రఘు.

"ఏమండీ—మీ రేమంటున్నారో తెలుసా?" అంది శారద కంగారుగా.

"ఏం—బాధగా వుందా?"

"ఇలాంటి మాటలు భర్త నోటివెంట వినడం ఏ భార్యకు బాధకలిగించదు?"

"నీ నోట అలాంటి మాటలు వింటే నాకు సంతోషంగా ఉంటుందా?"

"ఏమండీ—మీరు నా మనసును మభ్య పెట్టలేరు. మీరు ఇల్లుదాటిన క్షణంనుంచీ ఏం చేస్తున్నారో నాకు పూర్తిగా తెలుస్తూంటుంది. కావాలంటే మీకు టైము కూడా చెప్పగలను. నిన్న మీరు చేసిన ఆ దౌర్భాగ్యపు పని—సాయంత్రం మూడుగంటల ఇరవై నిముషాలకు!" అంది శారద.

రఘు ఉలిక్కిపడి—"నామీద చారులను నియమిస్తున్నావా?" అన్నాడు.

"చారులెందుకు నాకు? నా మనసుండగా—" అంది శారద.

రఘు ఆమెవంక చిత్రంగా చూసి—"ఊహాలోకాల్లో తేల్చే పుస్తకాలు చదవకు—" అన్నాడు.

"ఈ సలహా కోసం నేనిది చెప్పలేదు. ఈ రోజైనా మీ నడవడిక సరిగ్గా వుంటుందని హెచ్చరికగా చెప్పాను—"

"ప్లీజ్ శారదా! అలా అనొద్దు. నేను నీ వాణ్ని. నువ్వు నన్ననుమానిస్తున్నావన్న ఆలోచనే నాకు స్థిమితం ఉండనివ్వదు. ఒక్కసారి ఎప్పటికిలా నవ్వి నన్ను ఆఫీసుకు సాగనంపు—" అన్నాడు రఘు.

"నేను ఎప్పటికిలా నవ్వాలంటే — అందుకు మీ

కృషి కూడా ఉండాలి. నటించి లాభంలేదు—" అంది శారద.

"ఎవరో నీకు చెప్పుడుమాటలు...."

"నేను చెప్పుడు మాటలు వినే రకంకాదు. అదే నిజమైతే మన వివాహం జరిగివుండేది కాదు. మా నాన్న స్నేహితులందరిచేతా మీ గురించి చెడుగా చెప్పించాడు" అంది శారద.

"అప్పుడు నీకు రవంతైనా అనుమానం కలగలేదా?"

"లేదు. మీ విగ్రహం నాకు నచ్చింది. మీ మాటలు నాకు నచ్చాయి. మీ ముఖంలో మోసం కనబడలేదు నాకు. మిమ్మల్ని వదులుకోలేననిపించింది. మీలో ఏ లోపమున్నా నేను సరిదిద్దుకోగలనన్న నమ్మకముండేది. అందుకే ఎవరెన్ని చెప్పినా వినలేదు. ఏడుస్తూ ఈ పెళ్ళికి ఒప్పుకున్నాడు నాన్న—" అంది శారద.

ఈ కథంతా రఘుకి తెలిసినదే. అతను వాచీ చూసుకుని—"టైమయింది. కాఫీ తీసుకురా!" అన్నాడు.

"కాఫీ ఇవ్వకుండా మిమ్మల్ని ఆఫీసుకు పంపుతానా?" అంది శారద. ఆమె లోపలకు వెళ్ళి కాఫీ తీసుకువచ్చింది.

రఘు కాఫీ తాగి స్కూటరెక్కాడు.

## 2

సీట్లో కూర్చున్నాడు రఘు.

అది చల్లని ఎయిర్ కండిషన్ గది. తనకొచ్చే రెండు వేల అయిదొందల రూపాయల జీతంకంటె—ఈ చల్లదనమే ఎక్కువ హాయినిస్తుంది రఘుకి. ఆ గదిలో అతనొక్కడే! పిలిస్తే తప్ప ఎవ్వరూ లోపలకు రారు. పిలవకుండా రాదల్చినవారు ముందుగా ఇంటర్ కామ్‌లో అనుమతి తీసుకుని మరీ వస్తారు.

ఆ గదిలో మరో చిన్న అపార్టుమెంట్ ఉంది. అందులో అతడి పర్సనల్ సెక్రటరీ పరిమళ ఉన్నది.

ఆమెను అతడు పిలిస్తే ఎవ్వరికీ తెలియదు. ఆమెనతడు ఏం చేసినా ఎవ్వరికీ తెలియదు—తనో, ఆమే చెబితే తప్ప!

పరిమళకు రఘు తన నేంచేసినా అభ్యంతరం లేదు. అసలామెను చూడగానే యేదో చేయాలనిపించేలాగునే ఉంటుంది. అందుకే కంపెనీ ఆమెను ఎన్నికచేసింది. సమర్థుడైన ఆఫీసరుకు ఆకర్షణగా ఉండడం కోసమే కంపెనీ అతడికి సెక్రటరీనిచ్చింది.

రఘుకు ఉద్యోగం పెద్ద ఆకర్షణ. డ్యూటీ అంతకంటే ఆకర్షణ.

పరిమళ నవ్వితే నవ్వినట్లుండదు. ముద్దుకు ఆహ్వానిస్తున్నట్లుంటుంది.

నిన్న రఘు ఆమెను ముద్దుపెట్టుకున్నాడు. అయితే ఆ విషయం తనకూ, ఆమెకూ తప్ప తెలియదనుకున్నాడు. కానీ శారదకు తెలిసిపోయింది. అదీకాక ఆమె కచ్చితంగా టైము కూడా చెప్పింది.

ఆ టైము సరైనదే!

యెందుకంటే ఆమెను దగ్గరగా లాక్కోవడంలో ఒకరి వాచీ ఒకరికి తగిలింది.

"అద్దం బద్దలయిందేమో—" అంది పరిమళ. అప్రయత్నంగా తను వాచీ చూశాడు. టైము మూడూ ఇరవై అయింది.

ఈ విషయం బైటకు యెలా వెళ్ళింది.

తనకూ, పరిమళకూ ఉన్న సంబంధం మరెవరైనా కనిపెడుతున్నారా?

అయినా—అంత కచ్చితంగా హైము యెలా చెప్ప గలిగింది శారద?

కొంపతీసి ఆమె మనసు నిజంగా తనను అంటిపెట్టుకుని ఉన్నదా?

రఘు భయం భయంగా తన శరీరం వంక చూసు కున్నాడు.

శారద నిజంగానే తనను మనసారా ప్రేమించింది. తనూ ఆమెను ప్రేమించాడు. శారద తండ్రికీ వివాహం ఇష్టంలేదు. యెందుకంటే ఆయనకు తన గురించి తెలుసు. తనకు స్త్రీలోలత్వం ఉంది. తన మోజులోపడ్డ శారద యెవరేం చెప్పినా నమ్మలేదు. తనామెను భార్యగా ప్రేమించి ఆదరించినా స్త్రీలోలత్వాన్ని వదల్లేకపోతు న్నాడు. ఆ దుర్గుణాన్నామె సహించలేదు.

యేమిటి చేయడం?

ఒకవేళ పరిమళే శారదకు ఈ విషయం చెప్పిందేమో? అవును—లేకపోతే ఇంకెవరు చెబుతారు?

కానీ పరిమళకు విషయం చెప్పడంవల్ల లాభమేమిటి?

రఘుకు కారణం తోచలేదు. అతడు పరిమళనే అడిగి తెలుసుకోవాలనుకున్నాడు.

బల్లమీద మీట నొక్కాడు అతను. మరుక్షణంలో పరిమళ అతడిముందు ఉంది.

తొడలవరకూ మాత్రమే ఉన్న స్కర్టు—ఆమె విశాల హృదయాలను బహిర్గతపరచే డిజైన్‌లో వుంది. తీర్చి దిద్దినట్లున్న ఆమె శరీరపు వంపులు స్పష్టంగా తెలియడం కోసం—ఇంచుమించు చర్మాన్నంటి పోయేటంత బిగువైన డ్రస్సు ధరించిందామె.

రఘు పరిమళ నేదో అడగాలనుకున్నాడు. ఆమె నవ్వింది.

నవ్వుతున్న పరిమళ అతడికి పక్కనే వుంది.

ఆమె నిలబడివుంది.

రఘు ఆమెనేదో అడగాలనుకున్నాడు. కానీ తనూ లేచినిలబడ్డాడు.

ఇద్దరి పెదవులూ కలిశాయి. రఘు చేతులు ఆమె వెనుక బిగుసుకుంటున్నాయి.

సరిగ్గా అప్పుడే టెలిఫోన్ మ్రోగింది.

రఘు తీయలేదు. పరిష్వంగ సుఖంలో మరేపనీ చేయలేకున్నాడతను.

ఫోన్ అలా ఆగకుండా మ్రోగుతూనే వుంది.

ఆఖరికి అతను ఫోన్ యెత్తి—"హలో!" అన్నాడు.

"నేను—శారదను!" అంది అవతలి కంఠం.

రఘు తడబడ్డాడు—"శారదా, నువ్వా—యెందుకు... యేమిటయింది?"

"యేమీ కాలేదు. ముద్దు...." అంది శారద.

"అంటే?"

"నిన్న మీరు డూయెరకి చేసిన పని ఈ రోజు పదీ యాభైకి చేశారు—" అంది శారద.

అతని చేతిలోని ఫోన్ జారిపోయింది.

"మై గాడ్—ఇదెలా సాధ్యం—" అనుకున్నాడతను.

పరిమళ జారిపడిన ఫోన్ అందుకుని జాగ్రత్తగా క్రెడిల్ చేసి అక్కడే నిలబడింది!

"పరిమళా—నువ్వు వెళ్ళవచ్చు—" అన్నాడు రఘు. అతడి మనసు ఏదోలాగై పోయింది.

నిజంగానే శారద మనసు తనసు వెన్నంటి ఉందా?

పరిమళ వెళ్ళిపోయింది. సరిగ్గా పదీయాభై కి తను పరిమళను ముద్దు పెట్టుకుంటానని తనకే తెలియదు. అలాంటప్పుడీ విషయం మరొకరిద్వారా శారదకు చేరు తుందనుకోవడం అసంభవం.

మరి శారదకు ఎలా తెలిసింది?

ఆఫీసులో ఎవరైనా తనను రహస్యంగా కనిపెడు తున్నారా? ఏది యేమైనా—క్షణాలమీద ఆమెకెలా తెలిసిపోతోంది?

తనిలా పరిమళను ముద్దు పెట్టుకోవట మేమిటి?—ఫోన్ మ్రోగింది!

తనింక శారదను దబాయించి ప్రయోజనం లేదు. ప్రవర్తన మార్చుకోవాలి.

# 3

ఒక వారంరోజులు రఘు బాగానే వున్నాడు. అతడు పరిమళవైపు చూడనుకూడా చూడలేదు. పరిమళ అతడిలోని మార్పు కనిపెడుతోంది.

"బాస్—మీ రేదోలాగున్నారు—" అందామె.

"నేను బాగానే ఉన్నాను—" అన్నాడు రఘు.

"లేదు—మీ ఆరోగ్యంలో ఏదో లోపం కనపడు తోంది—" అంది పరిమళ.

రఘు ఆమెవైపు చూడకుండా—"పరిమళా—మన ల్నెవరో రహస్యంగా గమనిస్తున్నారు. నువ్వెళ్ళి నీ పని చూసుకో—" అన్నాడు.

"మన నెవరో గమనించడమా? అసాధ్యం...." అంది పరిమళ.

"అలా అనుకోవడానికి వీల్లేదు" అన్నాడు రఘు.

"మీరు నీడను చూసి బెదురుతున్నారేమో" అంది

పరిమళ.

అది నిజమే. భర్తకు భార్యనీడ! తను భార్య అనే నీడను చూసి బెదురుతున్నాడు. కానీ అందుక్కారణం లేదా? తను తన నీడను మోసగించడంలేదా?

"నువ్వు వెళ్ళు—" అన్నాడు రఘు.

పరిమళ కదల్లేదు-"మీరు నన్ను అనుమానిస్తున్నారు" అంది.

అతను ఆమెవంక అదోలా చూసి—"అవును. నీడను కూడా అనుమానించాల్సిన పరిస్థితి యేర్పడింది నాకు" అన్నాడు.

"మీరేం చేయమంటే అది చేస్తాను. నన్ననుమానించవద్దు ప్లీజ్!" అంది పరిమళ.

"ఆల్ రైట్—అయితే పద—బైటకు వెళదాం—" అన్నాడు రఘు.

రఘు, పరిమళ బైటకు బయల్దేదారు.

ఆ కంపెనీలో ఉద్యోగులందరికీ రఘును చూస్తే అసూయ. అతడిది యెంతో సుఖ జీవితం. అతడు తమందరికీ అధికారి!

స్కూటర్ మీద రఘు, పరిమళ ఒక హోటల్ కు వెళ్ళారు. రఘు అందులో ఒక గది కంపెనీ పేరున బుక్ చేశాడు. ఇద్దరూ గదిలోకి వెళ్ళారు.

"రూమ్ చాలా బాగుంది. రోజంతా ఇక్కడే గడుపుదామా!" అంది పరిమళ.

"రూమ్ నాకు నచ్చలేదు. నీకు నచ్చింది కాబట్టి రోజంతా నువ్వు ఇక్కడే గడుపు. మళ్ళీ నేను వచ్చి తాళం తీసేవరకూ ఏ అల్లరీ చేయకు—" అంటూ అతను గదితలుపు తాళంవేసుకుని వెళ్ళిపోయాడు.

తర్వాత అతను మహావిష్ణు హోటల్‌కి వెళ్ళాడు. అక్కడ అండర్ గ్రౌండ్ బ్రోతల్ హౌస్ రాత్రి పగలు పని చేస్తూంటుంది. రఘు ఓ అమ్మాయిని కుదుర్చుకుని ఓ గంటసేపు గడిపి తిన్నగా ఇంటికి వెళ్ళాడు. శారద ఏజెంట్లెవరో తెలుసుకోవాలని అతడికి చాలా కుతూహలంగా వున్నది.

తలుపు తీస్తూనే శారద వెక్కి వెక్కి ఏడ్చింది. అంత క్రితం కూడా ఆమె ఏడ్చిందనడానికి సూచనగా ఆమె కళ్ళు ఎర్రగా ఉబ్బి వున్నాయి.

"యేమయింది శారదా!" అన్నాడతను.

"కట్టుకున్న భర్త నాకు పూర్తిగా అన్యాయం చేశాడు...." అంది శారద.

"యేం జరిగిందిప్పుడు?"

"పెళ్ళాముండగా మీరు పరాయి ఆడదాన్ని మరిగారు. ఇప్పుడు...." అంటూ ఆమె టైముతో సహా వివరించి అతనేం చేశాడో చెప్పింది.

రఘు తెల్లబోయి — "ఇలా నీకెవరు చెప్పారు?" అన్నాడు.

"నా మనసు...."

"నేను నమ్మను. యెవరో నీకు నామీద విషం నూరి పోస్తున్నారు. వాళ్ళెవరో తెలిస్తే పీకపిసికి చంపేస్తాను" అన్నాడు రఘు.

"అయితే నన్ను చంపేయండి—" అంది శారద.

"శారదా!" అన్నాడు రఘు.

"భార్య వుండగా భర్త పరాయి స్త్రీల వెంట తిరుగుతున్నాడంటే అది ఆడదానికి ఎన్నివిధాల అవమానమో ఆలోచించారా?" అంది శారద.

"ప్లీజ్ శారదా—అలా అనకు...." అన్నాడు రఘు.

"మీరు నన్ను చంపేయండి. లేకపోతే నేనే చచ్చిపోతాను...." అంది శారద.

రఘు చటుక్కున ఆమె నోరు మూసి—"ఇంకెప్పుడూ అలా అనొద్దు శారదా—" అన్నాడు.

## 4

రఘులో చాలా మార్పు వచ్చింది. అతను బుద్ధిగా ఉండడం ప్రారంభించాడు. పరిమళ అతడి దగ్గరకు రావడానికిప్పుడు భయపడుతోంది.

ఒక నెలరోజులు గడిచాయి.

ఒకరోజున బిజినెస్ పనిమీద ఒకాయన రఘుని చూడ్డానికి వచ్చాడు. అయనతోపాటు అయన కూతురు హేమ కూడా వచ్చింది. హేమకు ఇరవై ఏళ్ళు. పేరుకు తగ్గట్టుగా పుత్తడి బొమ్మలా వుంది.

ఇద్దరూ బైటకు వెళ్ళాక ఒక నిముషంలో హేమ మళ్ళీ వెనక్కి వచ్చింది. "మీతో ఒక్క నిముషం పర్సనల్ గా మాట్లాడాలి. గదిలో ఇంకెవరైనా ఉన్నారా?"

"లేరు. నేను పిలిస్తే తప్ప ఇంకెవ్వరూ ఈ గదిలోకి రారు—"

"మీరు నాకు నచ్చారు. ఐ లవ్ యూ—" అంది హేమ.

"థాంక్స్—" అన్నాడు రఘు.

"నాకు పెళ్ళికాకపోతే మిమ్మల్నే పెళ్ళిచేసుకుని ఉండేదాన్ని—" అంది హేమ.

"ఇట్స్ ప్లెజర్. కానీ నాక్కూడా వివాహమై పోయింది—" అన్నాడు రఘు.

"ఐ ఎన్వీ యువర్ వైఫ్—" అంది హేమ.

"ఐ ఎన్వీ యువర్ హజ్బెండ్—" అన్నాడు రఘు. అతనికీ వ్యవహారం అనుమానంగా నేవుంది. తమ కంపెనీతో పనివున్న చాలామంది కూతుళ్ళనీ, కోడళ్ళనీ వంకపెట్టి ఇలా ఆడవాళ్ళను తీసుకొచ్చి ఎరవేసి పనులు సాధించుకు పోతుంటారు. అందులోనూ తను ఈ విషయంలో కాస్త పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు.

హేమ మనిషి చాలా చాలా బాగుంది.

"హి ఈజ్ యూస్‌లెస్ పెర్సన్—" అంది హేమ. అతడు నపుంసకుడట.

హేమ రఘుపట్ల యెంతో ఆసక్తి చూపించినా అతను అవును, కాదని అనలేదు. వింటూ ఊరుకున్నాడు.

"మీ రేమీ మాట్లాడ్డంలేదు....మీరూ నా భర్తకు లాగే...." అంది హేమ వాక్యం పూర్తి చేయకుండా.

రఘు ముఖం ఎర్రబడింది—"ఆడదంటే యెవరికైనా ఆశే—కానీ నా ఇబ్బందులు నాకున్నాయి—"

"ఏమిటి మీ యిబ్బందులు...." వెటకారంగా అంది హేమ.

"పరాయి ఆడదాని చేయి ముట్టుకోగానే నా భార్యకు తెలిసిపోతుంది—" అన్నాడు అతను.

"ఇట్స్ ఇన్క్రెడిబుల్—ఐ డోంట్ బిలీవిట్" అంది హేమ.

"నేనే నమ్మలేకపోతున్నాను—" అన్నాడు రఘు- "కానీ ఇది నిజం—" అంటూ రఘు తన అనుభవాలు చెప్పాడు.

"మీకు నేను నచ్చలేదు. అందుకే కోస్తున్నారు—" అంది హేమ.

"అందమైన ఆడపిల్ల కోరి ఆహ్వానిస్తూంటే ఇలాంటి అబద్ధాలు చెప్పేటంత మూర్ఖుణ్ణి కాను నేను...."

"మై గాడ్—జస్ట్—ఎ లిటిల్ బెస్ట్...." అంటూ ఆమె చటుక్కున అతణ్ణి కౌగలించుకుని ముద్దు పెట్టుకుంది.

చాలా కాలం తర్వాత—పరాయి ఆడదాని స్పర్శ... రఘు వెంటనే ఆమెను వదలలేకపోయాడు. అతడామెను వదిలేలోగానే బల్లమీద ఫోన్ మ్రోగింది.

రఘు శరీరం ఆపాదమస్తకం వణికిపోయింది. చటుక్కున అతడామెను వదిలి ఫోన్ తీశాడు.

"మళ్ళీ మీ బుద్ధి పెడదారితొక్కి వుంది—" అంది శారద.

ఆ మాటలు హేమ కూడా వింది. ఆశ్చర్యంతో ఆమె కళ్ళు పెద్దవయ్యాయి.

"చాలా విచిత్రంగా ఉంది—" అందామె.

"శారదా—నేను కావాలని ఈ పని చేయలేదు. ఒక అమ్మాయి నన్ను బలవంతంగా ముద్దు పెట్టుకుంది—" అంటూ జరిగింది వివరించాడతను.

"ఎవరైనా బలవంతంగా మిమ్మల్ని కత్తితో పొడవబోతూంటే చూస్తూ ఊరుకుంటారా? శాయశక్తులా ప్రతిఘటిస్తారు కదా — అలా ప్రతిఘటించడానికి ప్రయత్నం చేయలేదేం?" అంది శారద.

"బ్రావ్ రే!" అంది హేమ—"ప్రతిఘటించలేదని కూడా ఆమెకు తెలిసిపోయింది—"

రఘు ఫోన్ పెట్టేసి—"ఇదీ నా పరిస్థితి!" అన్నాడు.

"వేర్ దేరీజ్ విల్—దేరీజ్ వే—" అంది హేమ.

"అంటే?"

"శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు—" అంది హేమ.

"ఒక్కటి చెప్పు— ...."

"మీ భార్యకు మానవాతీత శక్తులున్నాయని నేను భావించడంలేదు. ఎవరో నమ్మకస్తుల్ని ఆమె తెలివిగా ఉపయోగించుకుంటోంది. అయితే నాకు మీ మీద మోజయింది కాబట్టి మంచి ఉపాయం ఆలోచించాను. ఆవిడ ఏజంట్లు ఎవరైనా మీరూ ఆమే కలిసివున్నప్పుడు నిఘా వేయరుకదా! ఏదో వంకన నేను మీ యింటికి వస్తాను. ఒక రాత్రికి ఆశ్రయం సంపాదిస్తాను. మీ భార్యకు నిద్రమాత్రలు తినిపించండి. ఆమె సమక్షంలోనే సరదా తీర్చుకుందాం. ఏ చిక్కూ ఉండదు. ఈ ట్రిక్కు పలికితే మీకే లోటూ ఉండదు. అప్పుడప్పుడా మెను ఇతర ప్రాంతాలకూడా తీసుకువెళ్ళి — మీ క్కావలసిన అమ్మాయిని నీ పక్కరూంలో వుంచుకుని కథ నడిపించవచ్చు. దీన్నే కోటలో పాగా వేయడం అంటారు—" అంది హేమ.

"వండర్ ఫుల్ —" అన్నాడు రఘు. ఇలాంటి అయిడియా తనకు తట్టనందుకు అతను ఎంతగానో బాధపడ్డాడు కూడా!

## 5

"ఈ ఒక్కరోజు మీ యింట్లో ఉంటాను. మా మామగారు మీవారికి తెలుసు. మాది సంప్రదాయమైన కుటుంబం. ఒక్కతైనూ హోటల్లో ఉంచడానికి మామగారి కిష్టముండదు. మీవారి నడిగితే ఇంటికివెళ్ళి మిమ్మల్ని అడగమన్నారు. మీ రంగీకరించకపోతే ఉన్నపళంగా తిరుగుప్రయాణం చేయాల్సొస్తుంది. అందువల్ల మామగారికి

అయిదు లక్షలు నష్టం...” అంటూ ఏవేవో చెప్పబోయింది హేమ.

“అయ్యో—దానికేముంది? మాది పెద్ద యిల్లు. మీరుండడానికేమీ అభ్యంతరం లేదు. మావారూరికే అలా అంటారు కానీ ఇందులో నా పెత్తనమేముంది?” అని నవ్వింది శారద. ఆమె హేమను బాగా ఆదరించింది.

హేమ ఆలోచిస్తోంది. తను ముద్దుపెట్టుకోగానే భర్తకు ఫోన్ చేసి చెప్పగలిగిందామె. కానీ తనను ఆమె గుర్తించలేదు. అంటే తనెవరో ఆమెకు తెలియదు. తనకూ, ఆమె భర్తకూ జరిగిన సంభాషణ ఆమెకు తెలియదు. ఎటొచ్చీ అదొక్కటే ఆమెకు తెలుసు.

ఎలా తెలుస్తోంది?

ఆమె మనసు నిజంగా భర్త దగ్గరుంటే అది జరిగిందేమిటో చూడడమేకాక—తనను కూడా చూడగలిగి ఉండాలి. అంటే—ఎవరో ఏజంట్లు ఆమెకు నిముషాల మీద వార్త నందిస్తున్నారు. అంత నిముషాలమీద వార్తలెలా చేరుతున్నాయి? ఏదైనా వైర్‌లెస్ ఏర్పాటు ఉందా? భర్త ప్రవర్తన గురించి తెలుసుకోవడానికి భార్య అంత కష్టపడుతుందా?

రఘుని ఎవరు కనిపెడుతున్నారు? ఆ కనిపెట్టినవారు దృశ్యాలనే చూస్తారా? మాటలు కూడా వింటారా? మాటలు కూడా వినే పక్షంలో తమ పథకం కూడా వారికి తెలిసిపోవాలి. అప్పుడీమె తగు జాగ్రత్తలో ఉండాలి—

అయితే శారద, హేమను మనస్ఫూర్తిగా ఆహ్వానించింది. ఆమెతో సరదాగా గడిపింది. సాయంత్రం భర్త యింటికి రాగానే—“ఏమిటి — అందరిదగ్గరా

మీరు భార్యా విధేయుడన్న సర్టిఫికెట్ సంపాదించ టానికి ప్రయత్నిస్తున్నారు?" అంటూ హేమను చూపించింది.

"మరి కాదా?" అన్నాడు రఘు.

"అవునో కాదో మీకే తెలును—" అంది శారద.

రఘు హేమకు వీలైనంత దూరంగా ఉండటానికి ప్రయత్నించాడు. హేమ కూడా శారదతోనే ఎక్కువగా తిరగటానికి ప్రయత్నించింది. రఘుపట్ల వీలైనంత తక్కువ ఆసక్తిని ప్రకటించింది. భోజనాలవద్ద ఆమె శారద వంటకాల్ని ప్రశంసించింది. శారద ఇల్లు సద్దుకున్న విధానాన్ని కూడా ఆమె మెచ్చుకుంది. తిరిగి వెళ్ళాక తన ఇంట్లో అలాంటి మార్పులు చేయాలన్నదామె. ఒకటి రెండు వంటకాలు కూడా యెలా తయారుచేయాలో శారదను అడిగి తెలుసుకుందామె.

శారదకు హేమ బాగా నచ్చింది.

రాత్రి తొమ్మిదిన్నరకు తనకు నిద్రవస్తోందని పడుకుంది హేమ.

భార్యాభర్తలు తమ పడకగదికి వెళ్ళారు. ఇంట్లో ఇంకెవ్వరూ లేరు. ముగ్గురే మనుషులు.

శారదకు రోజూ రాత్రి పడుకోబోయేముందు మంచి నీళ్ళు త్రాగడం అలవాటు. ఆమె బాత్రూంకు వెళ్ళిన సమయంలో నీళ్ళలో మత్తుమందు కలిపాడు రఘు.

శారద వచ్చి నీళ్ళుత్రాగకుండానే పడుకుంది.

రఘు ఆమెకు నీళ్ళ గురించి గుర్తు చేయాలనుకున్నాడు. కానీ గుర్తుచేస్తే ఆమె అనుమానిస్తుందేమో!

మంచినీళ్ళ గురించి పట్టించుకోకుండా ఆమె అతడితో కబుర్లు మొదలెట్టింది. హేమ యెంత మంచిదో, ఆమె

తనను ఎన్నివిధాలుగా మెచ్చుకుందో, తనలోని ఏయే గుణాలామెను ఆశ్చర్యపరచాయో చెప్పుకుపోతోంది రఘుకు. ఆమె హేమ గురించి మాట్లాడుతూంటే రఘు శరీరం వశం తప్పుతోంది. కొద్దిసేపట్లో తామిద్దరం అమర సుఖాలనుభవించబోతున్నారు. కానీ ఆ కొద్దిసేపటికోసం తనిప్పుడు ఎంతసేపు ఎదురుచూడాలో?

"ఆ సమానూ ఆ హేమ గురించికాక—మరింకేమైనా మాట్లాడరాదూ?" అన్నాడు రఘు.

"పరాయి ఆడదాని తలపువస్తే శ్రీవారి మనసు వశం తప్పుతుందని నాకు తెలుసు. కానీ అది మంచి బుద్ధి కాదు—...." అంది శారద అతణ్ని కవ్విస్తున్నట్లు.

రఘు తడబడ్డాడు. శారదకు తమ పథకం తెలుసా, తెలియదా? అయినా దూరంగా జరిగినవన్నీ తెలుసుకో గలుతున్న ఆమె తమ పథకాన్ని ఊహించలేదా? ఊహిస్తే పరిసితి నింతవరకూ ఎందుకు రానిచ్చింది? తన్ను రెడ్ హేండెడ్‌గా పట్టుకుందామనా?

"నీ యిష్టం. పోనీ ఆ హేమ కబుర్లే చెప్పు—నీతో యేమన్నా తగువే—" అన్నాడు రఘు విసుగ్గా.

హేమ కబుర్లు కాకపోయినా శారద యేదో ఒకటి వాగుతూనేవుంది తప్ప మంచినీళ్ళు తాగడంలేదు.

"అబ్బ—దాహంవేస్తోంది—" అంటూ లేచాడు రఘు. అప్పుడే శారదకు తన దాహం సంగతి గుర్తువచ్చి నట్లుంది—"అవునండీ—నాకూ దాహం వేస్తోందండీ" అంది.

"నీకూ తెస్తానుండు—"అంటూ మంచం దిగాడతను. పక్కనే ఉన్న నీళ్ళ సంగతి అతడికి గుర్తుంది. అయితే వాటి సంగతిచెబితే భార్య యేమనుకుంటుంది? అవి తన్నే

తాగమని తను వెళ్ళి నీళ్ళు తెస్తానంటుంది.

"ఈ రోజేమిటి—మీరింత బుద్ధిమంతులై పోయారు?" అంది శారద.

"నీ అనుమానమే గానీ నేనెలాగూ బుద్ధిమంతుణ్ణే!" అన్నాడు రఘు—"అయినా ఇందులో బుద్ధి దేముంది? ఎలాగూ నేను మంచినీళ్ళు తాగటానికి వెళ్ళాలి...." అని ఉలిక్కిపడ్డట్లు—"పోనీ మళ్ళీ నీకే అనుమానాలొస్తాయో యేమో—కూడా నువ్వూ రాకూడదూ...." అన్నాడు.

"అక్కర్లేదు వెళ్ళండి. ఈ రోజు నాకేమిటో బద్ధకంగా ఉంది. అయినా నా మనసు మిమ్మల్ని వెన్నంటి ఉండగా కూడా రావలసిన అవసరం నాకు లేదు—" అంది శారద. అది హెచ్చరికో, మరేమిటో రఘుకి అర్థం కాలేదు.

ఇప్పుడతనికి ఒక్కటే బాధ. శారద చేత ఆ నీళ్ళెలా తాగించాలీ అని. అంతరాంతరాల్లో శారదకు తమ పథకం తెలిసిపోయిందని అనుమానంగా కూడా ఉంది. అనుకున్నది జరగదనే బెంగ కూడా ఉంది.

అతను ఓ గ్లాసుడు నీళ్ళుతాగి మరో గ్లాసుడు నీళ్ళతో గదిలోకి వచ్చాడు. అప్పుడే శారద గదిలోని నీళ్ళుతాగి ఖాళీ గ్లాసును పక్కన పెడుతోంది. అతన్ని చూడగానే "మరిచిపోయాను. నేనెప్పుడూ నీళ్ళిక్కడే పెట్టుకుంటానుగా—" అంది శారద.

"నాకు గుర్తుంది. కానీ అవి తాగేశాక ఇంకా నీళ్ళు కావాలేమో అనుకున్నాను. అవున్నాయని తెలిస్తే నేనే అవి తాగేవాణ్ని—" అన్నాడు రఘు. అతడికి మనసులో సగం సంతోషంగానూ, సగం అనుమానంగానూ ఉంది.

శారద నిజంగా ఆ నీళ్ళు తాగిందా లేక తాగినట్లు నటిస్తోందా?

ఏది ఏమైనా తను వేచి చూడాల్సిందే.... అతను మంచమెక్కాడు. ఆమె ఆవులించింది.

"అదేం చిత్రమో.... ఉన్నట్లుండి నిద్ర ముంచుకు వస్తోంది...." అంది శారద.

రఘు కూడా ఆవులించి—"నాకూ అలాగే వుంది. అయితే ఇందులో చిత్రమేముంది? టైము పదిన్నర దాటింది—" అన్నాడు.

"అవుననుకోండి. కానీ ఈ రోజు నాకు కబుర్లు చెప్పాలనివుంది. మీతో చాలా మాట్లాడాలనివుంది—" అని మళ్ళీ ఆవులించి — "అబ్బా — లాభంలేదు...." అంది. ఆమె కళ్ళు మూతలు పడిపోతున్నాయి.

మందు పనిచేస్తూ ఉండైనా ఉండాలి. ఆమె నటిస్తూనైనా వుండాలి. అదే నటనైతే ఆమె అద్భుతమైన నటి అనుకోవచ్చు. అంత సహజంగా నటిస్తోందామె.

కొద్ది క్షణాల్లో నిద్రకు పడింది శారద. రఘు ఆమెను కదిపాడు. కుదిపాడు. ఆమె చలించలేదు. కొన్ని పరీక్షలైన తరువాత ఆమె నిజంగా నిద్రపోయిందని నిర్ణయించు కున్నాడు.

తను కలిపిన మందు చాలా బలమైనది. మరో ఆరు గంటలవరకూ ఆమెకు వళ్ళు తెలియదు. కానీ ఆమె నిజంగా మందు తాగిందా?

రఘు ఓ అరగంటసేపు ఎదురు చూశాడు. అతడిలో కోర్కెలు బుసలుకొడుతున్నాయి. నెమ్మదిగా మంచం దిగి హేమ ఉన్న గదిలోకి వెళ్ళి—"హేమా!" అని

పిలిచాడు.

హేమ సిద్ధంగానే వుంది. వెంటనే పలికింది.

ఇద్దరూ తిరిగి పడక గదిలోకి వచ్చారు. రఘు గది తలుపులు వేశాడు. శారదను జాగ్రత్తగా ఎత్తి నేల మీద పడుకోబెట్టాడు. తర్వాత హేమతో శృంగారం ప్రారంభించాడు.

ఈ అనుభవం అతడికి గొప్పగా ఉంది.

ఒకవేళ శారద నిద్ర నటిస్తూంటే అంతకంటె తెలివి తక్కువ మనిషి వుండదనుకోవాలి. తన ఎదురుగా భర్త పరాయి స్త్రీని అనుభవిస్తూంటే అంతా చూసి—తప్పు జరిగిపోయాక—నాకంతా తెలుసు—మీరు తప్పుచేశారు అనడంవల్ల ప్రయోజనమేమిటి?

అదీకాక ఆడది అలా సహించలేదు!

ఇంట్లో యింకెవ్వరూ లేరు. గదిలో తాము ముగ్గురమే ఉన్నారు. శారద నిద్రమత్తులో ఉంది. గది తలుపులు వేసివున్నాయి. జరిగింది శారద తెలుసుకునే అవకాశం లేదు.

తర్వాత రఘు, శారద గురించి ఆలోచించలేదు.

# 6

శారదకు తెల్లవారుజామున అయిదింటికి మెలకువ వచ్చింది. లేచి పక్కనే ఉన్న భర్తవంక చూసి అదోలా నిట్టూర్చింది. నిద్రపోతున్న అతడి ముఖంవంక తదేకంగా చూస్తూ—"ఎంత అందగాడు?" అనుకొంది.

ఈ అందమే తనను భ్రమలో పడేస్తుంది. ఈ అందమే తనను అతడికి దాసోహం కమ్మంటూంది. ఈ అందమే తనకు ఆకర్షణయింది. ఈ అందమే తనకు శాపమూ అయింది.

అతడిలో వున్న అవగుణాలన్నీ తెలిసి కూడా కేవలం అందానికి భ్రమపడి అతన్ని పెళ్ళాడింది. అతన్ని తన అదుపులోకి తెచ్చుకోవాలని ఆమె సంకల్పం. తెచ్చుకో గలనన్నది ఆమె నమ్మకం.

ఎన్ని అవగుణాలున్నా అతను మంచివాడు. అది ఆమె అదృష్టం!

శారద ప్రేమగా అతడి చెంపలు నిమిరింది. జుత్తులోకి వేళ్ళు పోనిచ్చింది. అతను వళ్ళెరక్కుండా నిద్రపో తున్నాడు. ఆమె యేంచేసినా అతడికి తెలియడంలేదు.

శారద మంచం దిగి పూజగదిలోకి వెళ్ళి కళ్ళు మూసుకుని దేవుడికి దణ్ణంపెట్టుకుంది. అది లేవగానే రోజూ ఆమె విధిగా చేసేపని. దణ్ణం అయేక ఆమె మందిరంలోకి చూసి ఉలిక్కిపడింది. మరుక్షణం ఆమె కళ్ళు యెర్రగా అయ్యాయి. కోపంగా పడక గదిలోకి పరుగెత్తి ఒక్క కుదుపు కుదిపి భర్తను లేపింది.

రఘుకు మత్తు కళ్ళు విడడంలేదు–"యేమిటి శారదా!" అంటున్నాడు ముద్దగా.

"రాత్రి....రాత్రి....మీరు పరాయి స్త్రీని అనుభ వించారు...." అంది శారద.

రఘు మత్తు విడిపోయింది...."యేమిటన్నావ్?"

"రాత్రి....మీరు...." అని ముఖం కప్పుకుని యేడవ సాగింది. శారద.

రఘు కలవరపడ్డాడు—"నువ్వేమంటున్నావో అర్థం కావడంలేదు నాకు...."

"అర్థమయ్యేలా చెప్పాలా?—....మీ వ్యవహారం సరిగ్గా రాత్రి పదకొండు గంటలకు ప్రారంభమైంది...." అంటూ మొదలుపెట్టి అతనే ఆశ్చర్యపోయేలా వివరించి

చెప్పింది శారద.

"ఎందుకలా అనుకుంటున్నావ్?" అన్నాడు రఘు అనునయంగా.

"ఇంక మీరేం మాట్లాడొద్దు. జరిగింది ఒప్పేసుకోండి. ఆఖరికి ఇంతకు తెగించారన్నమాట. మీక్కావలసిన దాన్ని ఇంటికే తీసుకొచ్చి...." అంటూ మళ్ళీ యేడ్వసాగింది శారద.

రఘుకి ఏమనాలో తెలియలేదు.

"శారదా—నీకు ఈ తప్పుడు సమాచారం ఎవరు చెప్పారో తెలిస్తే—నేను నీకు కలిగిన అపోహను తొలగించి ఉండేవాణ్ని. ఇప్పుడు నీకు ఎలా చెప్పాలో తెలియడంలేదు" అన్నాడు రఘు.

"అనవసరంగా దబాయించకండి. నా సమాచారం మనుషులమీద ఆధారపడ్డదికాదు. నా మనసు....అది అబద్ధం చెప్పదు...." అంది శారద.

"అయితే నీ మనసు నన్ను తప్పుచేయకుండా ఎందుకు ఆపదు? అంతా చూస్తూ ఊరుకుని అప్పుడు ఈ రంగంలోకి దిగుతుందేం? నువ్వనేది యెంత హాస్యాస్పదంగా వుందో నువ్వే అర్థంచేసుకో—" అన్నాడు రఘు,

"మనసు అనుభూతి పొందగలదు తప్పితే మాట్లాడలేదు. మాట్లాడే తనువు అప్పుడే అపస్మారక స్థితిలో ఉందో. రాత్రి మంచినీళ్ళు తాగేవరకూ బాగానే వున్నాను. తాగగానే నిద్రముంచుకొచ్చేసింది. ఇప్పుడు నాకు అనుమానం కల్గుతోంది. ఇది మీరు కావాలని ఆడిన నాటకమేనని. ఆ గ్లాసులో మిగిలిన నీళ్లు పరీక్షచేయిస్తే అందులో నిద్రమందు కలిసిందీ లేనిదీ తెలుస్తుంది—"

అంది శారద.

రఘు ఆమెవంక భయంగా చూస్తూ—"అందులో నిద్రమందు కలిసిందని తెలిస్తే ఏంచేస్తావ్?" అన్నాడు.

"ఇంత విషంతాగి చచ్చిపోతాను!" అంది శారద.

"ప్లీజ్—అంతమాటనకు శారదా!" అన్నాడు రఘు. అతను చటుక్కున చేతుల్లో ముఖం కప్పుకుని—"నేను పాపిని, నీచుణ్ని, నీకు తగనివాణ్ని. నన్నెందుకు పెళ్ళి చేసుకున్నావు నువ్వు?" అంటూ ఏడ్వసాగాడు.

"ఛీ — అసహ్యంగా ఏడుస్తారెందుకు?—" అంది శారద—"తప్పుచేసింది నేను. మిమ్మల్ని పెళ్ళిచేసుకోవడం తప్పు అని అంతా అన్నారు. కానీ కాదని వాదించాను నేను. ఈ రోజు మీరు కూడా అంతా అన్నమాటే అంటున్నారు. ఇంక నేను బ్రతికి లాభం లేదు. మరొక్కసారి మీరిలా ప్రవర్తించారో నేను మిమ్మల్ని హెచ్చరించను. నా ప్రాణం తీసుకుంటాను-"

అతను కళ్ళు మెరిశాయి—"అంటే నువ్వు నాకు మరొక్క అవకాశం ఇస్తున్నావా?" అన్నాడు.

"ఏం—ఇవ్వననుకున్నారా-ఇవ్వకూడదనుకున్నారా?" అంది శారద తీవ్రంగా.

రఘు చటుక్కున శారద చేతులు పట్టుకుని—"అలా మాట్లాడకు శారదా! నాకు నువ్వు కావాలి—నువ్వు నా దేవతవు. నువ్వు లేనిదే నేను బ్రతకలేను. నన్ను నేను సంస్కరించుకుంటాను. ఒక్క అవకాశం ఇవ్వు—" అన్నాడు.

"ఒక్క అవకాశం మాత్రమే ఇస్తున్నాను—" అంది శారద.

"ఏమండీ ఎలాగుంది?" అనడిగింది శారద.

"నే నిక్కడున్నానని ఎలా తెలుసు?" అనడిగాడు రఘు నీరసంగా నవ్వుతూ.

"అందులో ఆశ్చర్యమేముంది?"

"నాకు ఆక్సిడెంటయినట్లు సాయంత్రందాకా నీకు చెప్పొద్దని చెప్పాను—" అన్నాడు రఘు—"అయినా ఇది పెద్ద యాక్సిడెంటేంకాదు. ఓ గంట రెస్టు తీసుకుని ఇంటికెళ్ళిపోవచ్చు నన్నాడు డాక్టర్—"

"మీరు చెప్పకపోతే నాకు తెలియదనుకున్నారా. మిమ్మల్ని వెన్నంటి ఉండే నా మనసు ఎప్పటికప్పుడు మీ గురించి నాకు సమాచారం అందజేస్తూనే ఉంటుంది. మీకలా ఆక్సిడెంటు కాగానే— నేను మీ ఆఫీసుకు ఫోన్ చేశాను. వాళ్ళు తమకేమీ తెలియదన్నారు. నేను ఆఫీసుకు బయల్దేరి వెళ్లాను. అప్పుడే వార్త అక్కడికి చేరింది. నేను హాస్పిటల్ కి పరుగున వచ్చాను—"

రఘుకు పెద్దగా దెబ్బలేం తగల్లేదు. అతడు ఆశ్చర్యంగా భార్యవంక చూస్తూ—"నీకేమైనా మానవాతీత శక్తులున్నాయా అని అనుమానంగా ఉంది-" అన్నాడు.

"మంచి మనసు ఉంటే శక్తులు మనిషిని వెతుక్కుంటూ వస్తాయి—" అంది శారద.

రఘు రెండు రోజులు ఇంటిపట్టునే ఉండి విశ్రాంతి తీసుకున్నాడు. గత కొద్దిరోజులుగా అతడి ప్రవర్తనలో మార్పు కనబడుతోంది. అతడు అమ్మాయిలకు బాగా దూరంగా ఉంటున్నాడు. తనకో మగ పర్సనల్ సెక్రటరీని నియమించుకున్నాడు. ఆఫీసులో ఏకాంతం కూడా తగ్గించాడు.

ఇంట్లో భార్యతో అతను అనేకమార్లు ఇలా చెప్పాడు.

"శారదా, నాలో స్త్రీలోలత్వం ఉంది. అది నా బలహీనత. ఒప్పుకుంటాను. కానీ నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీ కోసం ప్రాణాలిమ్మన్నా ఇస్తాను. నువ్వు కష్టపడితే సహించలేను. నువ్వు లేకపోతే బ్రతకలేను. నువ్వు నా జీవితంలో ప్రవేశించడం నా అదృష్టం. నా బలహీనతను జయించడానికి నా శాయాశక్తులా ప్రయత్నిస్తాను. ప్రయత్న లోపమేమీ ఉండదు. కానీ నా ఉద్యోగం పరిస్థితి నీకు తెలుసు. యెందరో నామీద వలలు పన్నుతుంటారు. ఋష్యశృంగుణ్ని కూడా పడగొట్టగల లలనామణులు రంగంలో దిగుతారు. అలాంటప్పుడు నేను తప్పు చెయ్యొచ్చు. చెయ్యకూడదన్నదే నా ఆశ. కానీ తప్పుచేస్తే నన్ను క్షమించు. నీ ప్రాణాలు తీసుకోకు. ఒకవేళ నీకు ప్రాణాలు తీసుకోవాలనిపిస్తే— ముందు నా ప్రాణాలు తీసి తర్వాత యేమైపోయినా ఫర్వాలేదు. నీ గురించి ఎటువంటి దుర్వార్తా విని భరించలేను నేను—"

ఈ మాటలు చెప్పినపుడు అతడి కళ్ళలో నిజాయితీ ప్రతిఫలించేది. ముఖంలో అమాయకత కనబడేది. అప్రయత్నంగా శారద అతడి కనులలో కరిగిపోయేది.

భర్త ఆఫీసులో చేసిన మార్పుల గురించి శారద విన్నది. ఆమె సంతోషించింది.

ఒక రోజున శారద భర్తతో కలిసి బజారుకి వెళ్ళినపుడు మెరుపుతీగలాంటి అమ్మాయి కనబడితే—క్షణం పాటు రఘు ఆమెను రెప్పవాల్చక చూశాడు.

శారద అతడిచేయి గిల్లి—"కావాలనిపిస్తోందికదూ—పాడు బుద్ధి!" అంది.

రఘు శారదవంక అదోలా చూసి—"అందాన్ని నే నొక్కణ్నే కాదు. చాలామంది చూస్తారు ..." అన్నాడు.

"చాలామంది చూసి ఊరుకుంటారు. మీకూ చాలా మందికీ అదే తేడా!"

రఘు అక్కణ్నించి కదుల్తూ—"చిన్న పనివుంది—ఇక్కణ్నించి పోదాం—" అన్నాడు. శారద మాట్లాడకుండా అతణ్ని అనుసరించింది. కాసేపలా బజార్లో తిరిగి ఇద్దరూ ఓ దుకాణంలోకి వెళ్ళారు. రఘు అక్కడ ఆరంగుళాల పొడవున్న స్టెయిన్ లెస్ స్టీల్ బాకు ఒకటి ఖరీదు చేశాడు.

బైటకు వచ్చేక—"ఇదెందుకు?" అంది శారద.

"ఇంటికెళ్ళాక చెబుతాను—" అన్నాడు రఘు మౌనంగా.

ఇద్దరూ ఇల్లుచేరాక శారద వెంటనే బాకు గురించి అడిగింది. ఆమెకు చాలా కుతూహలంగా ఉంది.

"చంపడానికి!" అన్నాడు రఘు.

"యెవర్ని?" అంది శారద అనుమానంగా.

"ఆ పిల్లను...."

"యే పిల్లను?" ఆశ్చర్యంగా అడిగింది శారద.

"ఇందాకా షాపులో నేను చూడగా నువ్వు అనుమానపడ్డావే—ఆ పిల్లను!"

"ఆ పిల్లను చంపడమెందుకు?" అంది శారద మరింత ఆశ్చర్యపోతూ.

"యెందుకేమిటి? ఆమెను వాంఛిస్తున్నాననిగదా నీ అనుమానం. ఆమెనెంతగా ద్వేషిస్తున్నానో నీ కర్థం కావడంకోసం ఆమెను చంపేస్తాను...."అన్నాడు రఘు.

శారద రఘు ముఖంలోకి చూసింది. అతడి కళ్ళల్లో

దృఢ నిశ్చయం కనబడింది.

"కాంపతీసి అంతపనీ చేశారు గనుక...." అంది అదో జోక్ కింద తీసిపారేస్తూ.

"చేస్తాను...." అన్నాడు అతను.

"మీకేం పిచ్చిపట్టడం లేదుకదా!" అంది శారద.

"నీ అనుమానం నాకు పిచ్చిపట్టిస్తోంది. ఈ రోజునుంచీ కంటికి కనిపించిన అందమైన ఆడపిల్లనల్లా చంపేయడమే నా వృత్తిగా పెట్టుకుంటాను—"అన్నాడు రఘు కసిగా.

శారద అతడి గుండెలమీద చేయివేసి—"పరాయి స్త్రీలకు మిమ్మల్ని దూరంగా ఉండమన్నదెందుకు? మీరు నాకు మరింత దగ్గరవుతారని....మీరో హంతకుడుగా మారితే నాకేం ప్రయోజనమండీ — మీరెప్పుడూ నాతోనే వుంటూ నన్నే తలవాలి. మనం ఒకరికోసం ఒకరం బ్రతకాలి. అదీ నా కోరిక...." అంది.

రఘు ఆమెను దగ్గరగా తీసుకుంటూ—"ఇరవై నాలు గంటలూ నువ్వు నన్ను అనుమానిస్తూ ఉంటే అదెలా సాధ్యపడుతుంది? నేను మారానని నమ్మకం నీక్కలక్క పోతే నేను హంతకుణ్ణికాక తప్పదు...." అన్నాడు.

"మీరు మారారని నేను నమ్ముతున్నాను. ఇందాకా ఏదో జోక్ చేస్తే మీరు సీరియసైపోయారు. యెప్పుడూ మీరు హత్యల గురించి మాట్లాడకండి. నాకు భయం వేస్తుంది—" అంది శారద.

"ఒక్కసారి మాట్లాడనీ—" అంటూ బాకు తీశాడు రఘు. శారదకు దాన్నందించి — "ఇది నీ దగ్గరుంచు. యెప్పుడైనా నీ మనసు నా గురించి తప్పుచేసిన సమాచారం అందించిందా—అప్పుడీ బాకుతో నన్ను చంపేసేయ్. ఈ విషయంలో ఇహ నీవేం చెప్పినా విన

దల్చుకోలేదు. నువ్వు నన్ను చంపని పక్షంలో—నీ నుంచి అభియోగం విన్న తక్షణం ఇంక నేనే ఈ బాకుతో నన్ను నేను చంపుకుంటాను. అందుకే ఈ బాకు కొన్నది—"

శారద భయంగా ఆ బాకువంక చూసింది. అది తళతళా మెరుస్తోంది.

## 8

అతను తలుపు తట్టాడు.

ఆమె తలుపు తీసి—"వచ్చావా?" అంది.

"నీ పిలుపు నెప్పుడు కాదన్నాను?" అన్నాడతను.

"అలా మాట్లాడకు స్వరూప్—" అంది ఆమె.

"మరెలా మాట్లాడను శారదా!" అన్నాడతను.

"నేను వివాహితను. మనసా, వాచా రఘుకు అంకితమై పోయినదాన్ని. నన్ను వేరే ఒకరు ప్రేమించడం, ఆరాధించడని నేను సహించలేను. ఒక అన్నలా నిన్ను అభిమానించాలని ఆశిస్తున్నాను .. " అంది శారద.

"నా శరీరాన్ని శాసించగలవు కానీ నా మనసును నువ్వు శాసించలేవు శారదా! యెటొచ్చీ నీకు కష్టం కలిగించే పని యేదీ చేయలేదు నేను. ఇకముందు కూడా చేయబోను...." అన్నాడు స్వరూప్.

స్వరూప్ శారదను ప్రేమించాడు. శారద తండ్రి కూడా అతణ్ని ఆమెకు తగిన భర్తగా భావించాడు. కానీ శారద రఘుని ప్రేమించింది. వివాహం చేసుకుంది.

"నువ్విచ్చిన ఎలక్ట్రానిక్ స్త్రీ అమోఘంగా పని చేస్తోంది—" అంది శారద.

"అది నీ కోసం నా మేధనంతా వినియోగించి తయారు చేశాను. పని చేసి తీరాలి—"

"పద—చూద్దువుగాని...." అంది శారద.

ఇద్దరూ లోపలకు పూజగదిలోకి వెళ్ళారు. అక్కడ దేవుడి మందిరంలో ఓ చిన్న ప్లాస్టిక్ చెట్టు ఉన్నది. అది తమాషాగా కదుల్తోంది.

"చూశావా—యిప్పుడే ఆయన యెవరితో షేక్ హేండిచ్చారు. యేమయిందో యేమో విరగబడి నవ్వుతున్నారు...." చెట్టు కదలికనుబట్టి శారద చెప్పుకుపోతోంది.

"రికార్డు కూడా ఆన్ చేశావా?"

"ఆహా—అది చక్కగా యే టైముకు ఏయే ముఖ్య కార్యాలు జరిగాయో టైపుచేస్తోంది. శరీరంలో కలిగే ముఖ్యమైన మార్పులన్నీ నాకు తెలిసిపోతున్నాయి. నేను చెబితే ఆయన ఆశ్చర్యపోతున్నారు. నువ్వు నిజంగా మేధావివి—" అంది శారద.

స్వరూప్ నిట్టూర్చి—"యెందరో మేధావులకులాగే నేనూ భగ్న ప్రేమికుణ్ని—" అన్నాడు.

స్వరూప్ వంక శారద అదోలా చూసి—"నన్ను, ప్రేమను కలిపి మాట్లాడ్డం నాకింకా నచ్చలేదు—"అంది.

"అలా కలిపి ఆలోచించడంవల్లనే నేను నీ కోసం ఈ యెలక్ట్రానిక్ వృక్షాన్ని చేయగలిగాను—" అన్నాడు.

ఎలక్ట్రానిక్ వృక్షం నిజంగానే గొప్ప మేధాశక్తితో చేయబడింది. మనిషి నరాల సంచలనాన్ని కదలికతో ప్రతిఘటించగలదా వృక్షం. అది శారద కోసం అహో రాత్రాలు పరిశ్రమించి తయారుచేశాడు స్వరూప్. అందుకు శారద కూడా అవసరమైన సమాచారన్నిచ్చింది. ఏ రకం కదలికకు రఘులో నరాల సంచలనం ఏ విధంగా కలుగుతుందో—స్వరూప్ ఇచ్చిన పరికరాల ద్వారా రికార్డు చేసింది. ఎలక్ట్రానిక్ వృక్షాన్ని స్వరూప్—రఘుకి అను

గుణంగా తయారుచేశాడు.

"X—Y—3 ఫ్లూరైడ్ అయిపోయింది—అందుకే నీ కోసం కబురుపెట్టాను—" అంది శారద.

"బహుశా అందుకే అయుంటుందని నేను ఊహించాను—" అంటూ జేబులోంచి ఓ సీసా తీశాడు స్వరూప్.

ఎలక్ట్రానిక్ వృక్షంలో సంచలనం కలగాలంటే రఘు ఆ ద్రవం రోజుకు ఒక చుక్క చొప్పున తాగాలి. ఆ ద్రవం రక్తంలో సులభంగా కలిసిపోతుంది. రోజుకు ఒక చుక్క నరాల సంచలనాన్ని — ఎలక్ట్రానిక్ వృక్షానికి పంపడానికి ఖర్చవుతుంది. ఎన్ని చుక్కలు వేస్తే అన్ని రోజులు పనిచేస్తుంది ఎలక్ట్రానిక్ వృక్షం.

"చాలా థాంక్స్—" అంది శారద ఆ సీసా అందుకుంటూ. నాలుగైదు రోజుల్లో భర్త ఆఫీసు పనిమీద నెలరోజులు టూర్ వెళ్ళబోతున్నాడు. అప్పుడాయన ఎలా ప్రవర్తిస్తాడో ఏమిటో—ఈ మందు ఎంతైనా అవసరమే!

స్వరూప్ శారదవంక అదోలా చూసి—"ప్రవర్తన సరిగాలేని అతడిపై నీకంత మోజు ఎందుకు?" అన్నాడు.

"మరీ ఇలా ఉంటాడని పెళ్ళికి ముందు అనుకోలేదు" అంది శారద.

ఆ మాటలకు స్వరూప్ కళ్ళు మెరిశాయి—"శారదా! తెలివైనవాళ్ళు చేసిన తప్పును సరిదిద్దుకుంటారు—" అన్నాడతను.

"అందుకేగదా నీ సాయం కోరాను—"

"మరోవిధంగా నీకు సాయపడడానికి కూడా నేను సిద్ధంగా వున్నాను" అన్నాడు స్వరూప్.

"అంటే?"

"శారదా! నన్నర్థం చేసుకో. నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను. పరాయి ఆడదాని గాలి సోకినా నాకు నచ్చదు. నువ్వు తప్ప నాకు వేరెవ్వరూ వద్దు. ఇలా భావించే నన్ను వదిలి—ఎలక్ట్రానిక్ వృక్షంతో అను క్షణం హద్దులో ఉంచవలసిన మగాడి చుట్టూ నీ మనసు యెందుకు తిరుగుతోందో—ఈ వివాహంలో నువ్వుపొందే సుఖమేమిటో నాకు అర్థం కావడంలేదు. రఘును అదుపులో ఉంచడంకోసం ఎలక్ట్రానిక్ వృక్షం తయారు చేశాను. అతన్ని వదిలిపెడతానంటే నిన్ను నాదాన్ని చేసుకుందుకు నే నెన్నడూ సిద్ధంగా నే ఉంటాను—"

శారద ఆ మాటలకు కోపగించుకోలేదు. జాలిగా అతడివంక చూసి—"నిన్నో, నన్నో దురదృష్టం వరించింది. అష్టకష్టాలూపడి అతణ్ని అదుపుచేయడానికి ప్రయత్నిస్తాను తప్పితే మరో మగాణ్ని నా జీవితంలోకి అహ్వానించలేను. ఆ సంగతి నీకు తెలుసు—" అంది.

"సరే—మరి నేనుంటాను. మీ ఆయనకు X—Y—3 ఫ్లూరైడ్ ని దేంట్లో కలిపిస్తున్నావు. కాఫీలోనే కదా?—అందులో తప్ప మరెందులో వేసినా అది ఇమడదు. వాసన తెలిసిపోతుంది—" అన్నాడు స్వరూప్.

"రోజూ ఆఫీసుకు వెళ్ళేముందు ఆయనకు కాఫీ ఇస్తాను. అందులో ఈ ద్రవం కలుస్తుంది...." అని—"ఆయన ఆఫీసు పనిమీద పెద్ద టూర్ వేస్తున్నారు. ఇది అర్జంటయింది—" అంది శారద.

"అర్జంటంటే ఎన్నాళ్ళేమిటి?"

"నెలరోజులనుకోవచ్చు—" అంది శారద. స్వరూప్ వెళ్ళిపోయాడు.

# 9

"నెలరోజులు నిన్ను విడిచి వుండాలి. ఎలాగో!" అన్నాడు రఘు.

"నాకూ అలాగేవుంది. కానీ నా మనసెప్పుడూ మిమ్మల్ని వెన్నంటే వుంటుంది—" అంది శారద.

"ఇది హెచ్చరికా?"

"కాదు—ప్రేమ!" అని నవ్వింది శారద.

"అవును శారదా—మనది విచిత్రమైన ప్రేమ! కండ పట్టివున్న ఆడదాన్ని చూస్తే నాలో కండకావరం చెలరేగుతుంది. కానీ నా మనసులోని ప్రేమ నీకుమాత్రమే పరిమితం. క్షణక్షణమూ నాపైన అనుమానం నీకు. కానీ నేనే కావాలి నీకు. నేను లేనిదే నువ్వు బ్రతకలేవు. నువ్వు లేనిదే నేను బ్రతకలేను. అయితే మన జీవితాల్లో కొత్త మార్పులొస్తున్నాయి. నీలోని అనుమాన భూతం క్రమంగా చచ్చిపోతోంది. నాలోనూ మార్పు వస్తోంది. నీ మనసు నన్ను వెన్నంటి ఉండడం కాదుగానీ నాకు పరాయి స్త్రీలపట్ల విముఖత పెరిగింది. మొన్న క్లబ్బులో ఓ స్త్రీ నన్ను కొంటెగా తాకితే నేను గ్రుడ్లెఱ్ఱజేసి చూశాను. నేను మారిపోతున్నాను శారదా—మారిపోతున్నానేమిటి — మారిపోయానేమో కూడా—" అన్నాడు రఘు.

శారద అతడి ముఖంవంక చూసి—"యెంత అమాయకంగా ఉంది?" అనుకుంది. అప్రయత్నంగా ఆమె అతడి బుగ్గలమీద ముద్దుపెట్టుకుని—"మన ప్రేమ విచిత్రమైనదే కావచ్చు. కానీ అది అమరం కూడా—" అంది.

"ఐ లవ్ యూ శారదా!" అంటూ అతడామెను బలవంతంగా ముద్దుపెట్టుకున్నాడు. శారద చేతులు

అతణ్ని బలంగా పెనవేసుకున్నాయి.

"మరి వచ్చేదా?" అన్నాడు రఘు.

"ఉండండి—కాఫీ తాగి వెడుదురుగాని...." అంది శారద.

"నేను మరిచిపోయినా కాఫీ సంగతి నువ్వు మరువవుగదా—" అన్నాడతను నవ్వుతూ.

# 10

రఘు ఒక్కడూ లాన్లో కూర్చునివుండగా—"హాయ్" అంటూ పలకరించిందో యువతి.

"మీ రెవరో నాకు తెలియదు—" అన్నాడు రఘు ముఖం చిట్లించి.

"కావాలనుకుంటే స్త్రీ పురుషులకు పరిచయం ఎంత సేపు?" అందామె.

"నేను కావాలనుకోవడంలేదు—" అన్నాడు రఘు చిరాగ్గా.

ఆమె చనువుగా అతడి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుని — "నేను కావాలనుకుంటున్నాను—" అని "యూ ఆర్ రియల్లీ బ్యూటిఫుల్ —" అందామె.

"థాంక్స్!"

"ఉత్త థాంక్సేనా?" అందామె.

"నిజం చెప్పినవాళ్ళకు థాంక్సుకు మించి ఏమీ ఇవ్వను నేను—" అన్నాడు రఘు.

"కానీ నేను తీసుకోగలను—" అందామె.

"ఎవరు మీరు?" అన్నాడు.

"ఎవరైనా కాల్ గర్ల్ని మాత్రం గాదు. మిమ్మల్ని చూడగానే థ్రిల్లయిపోయాను. మీతో మాట్లాడాలనిపించింది. యెంత మాట్లాడినా తనివితీరలేదు. ఆఖరికి

మీరు నావైపు నిర్లక్ష్యంగా చూస్తున్నప్పటికీ కూడా!"

రఘు ఆమెవంక అదోలా చూసి—"ఎందుకు మీరు మీ సమయం వృధాచేసుకుని నా సమయం వృధా చేస్తారు? నన్ను పొగడడం ద్వారా మిమ్మల్ని మీరు చిన్నబుచ్చుకుంటున్నారు. మీ అందం ముందు నేనెంత? మీరు తల్చుకుంటే వేలకువేలు బాయ్ ఫ్రెండ్స్ దొరుకుతారు మీకు—" అన్నాడు.

"నేను తల్చుకున్నాను. మొదటి బాయ్ ఫ్రెండే అవతలకి పొమ్మంటున్నాడు—" అందామె.

"అవును మరి—అతను వివాహితుడు"—అన్నాడు రఘు.

"మీరు వివాహితులా? నమ్మడం కష్టం. బహుశా నన్ను వదుల్చుకుందుకు అబద్ధం చెబుతున్నారనుకుంటాను" అందామె.

"నిజం—కావాలంటే ఋజువులు చూపిస్తాను. నేను నా భార్య వివాహంనాడు తీయించుకున్న ఫోటో ఒకటి ఎప్పుడూ నా పర్సులో ఉంటుంది—" అన్నాడు రఘు.

"వివాహమైందన్నా సరే-నా మనసు మిమ్మల్నే కోరుతోంది—" అందామె.

"అది చాలా తప్పు. మీ భర్త తప్పుదారిన పడితే మీకు నచ్చుతుందా?—" అన్నాడు రఘు.

"మీవంటి భర్త దొరికితేనా—మీరెలా మసలినా నేను పట్టించుకోను. తొలి రాత్రే మీరు మరో ఆడది కావాలన్నా నేను విచారించను. మీవంటివాణ్ని భర్తగా పొందడమే నా అదృష్టం—" అందామె!

రఘు ఆలోచనలోపడ్డాడు. తను నిజంగానే అందగాడు. యెందరో ఆడవాళ్ళు కోరి తన కౌగిట్లో నలిగి

పోయారు. తన గుణం తెలిసి కూడా శారద వివాహం చేసుకుంది తనను. తనవంటివాడు భర్తగా లభించడమే అదృష్టమా? అందుకే శారద తన తప్పులన్నీ క్షమించగల్గుతోందా? తను ఇంకా తప్పులుచేసినా ఆమె తన్ను క్షమిస్తుందా?

"ఏమండీ—ప్లీజ్—ఒక్క అయిదు నిముషాలు. నేను మీ పక్కరూంలోనే ఉంటున్నాను...."

ఆ యువతి అరిస్తోంది.

రఘు మనసు ఊగిసలాడుతోంది. తనను ప్రేమించడంలో శారద గొప్పతనం ఏమీ లేదా? అంతా తన గొప్పతనమేనా?

రఘులో అహం పెరుగుతోంది. ఆమె అతడి అహాన్ని పెంచుతోంది.

అతను లేచాడు. ఆమెను అనుసరించాడు.

అప్పటికి రఘు ఇల్లు వదిలిపెట్టి రెండు వారాలయింది. ఈ రెండు వారాలు కూడా అతనెంతో బుద్ధిగా ఉన్నాడు. తీరుబడి సమయంలో ఫిలాసఫీ పుస్తకాలు చదువుకుంటున్నాడు. మనసు కొద్దిగా ఆరాటపడుతోంది. అయినా నిగ్రహించుకుంటున్నాడు. చూస్తూండగా ఇప్పుడీ ఆహ్వానం వచ్చింది. ఏం చేయాలి?

అతడామె గదిలో ప్రవేశించాడు. అతని వెనకనే ఆమె తలుపులు మూసింది.

ఆమె అతణ్ని తాకలేదు. అతడి అందాన్ని పొగడుతోంది. అతణ్ణి భార్యగా పొందిన ఆడది—పాదదాసిగా ఊడిగమైనా చేయవచ్చునంటోంది. అలాంటి భర్తవుంటే పురాణంలోని పతివ్రతలకంటె పెద్ద త్యాగాలు చేయవచ్చునంది.

రఘులోని పురుషుడు నెమ్మదిగా అతడి మెదడును స్వాధీనం చేసుకుంటున్నాడు. అపురూప లావణ్యరాశి ఎదురుగా ఉంది. కోరి పిలుస్తోందామె. తను దైవస్వరూపుడు. ఆడవాళ్ళంతా తన బానిసలు. అలాంటి బానిసల్లో శారద ఒకతె! తనామెను గదమాయించడానికి బదులు ఆమె అదుపులోకి వెడుతున్నాడు.

కానీ.... శారద మనసు ఎప్పుడూ తనను వెన్నంటే ఉంటుంది.

అప్పుడా యువతి పైట జారింది. అతడి చూపులు స్థిరంగా ఆమె గుండెలపై నిలిచాయి. క్రమంగా ఆ చూపుల్ని ఆమె చూపులతో కలిపాడు. అప్పుడామె నవ్వింది.

ఆ నవ్వు పరిమళ నవ్వుకిలాగుంది. దానికి తట్టుకోవటం కష్టం. రఘు ఒక్కడుగు ముందుకు వేశాడు. ఆమె వెనుకడుగు వేసింది. తర్వాత వెనక్కి తిరిగింది. కంగారులో చీర అక్కడి సోఫాకు తగులుకుంది. ఆమె అలాగే ముందుకు వెళ్ళిపోయింది.

చక్కటి అంగసౌష్టవమామెది. పల్చటి లంగా.... ఎత్తయిన గుండెలు.

రఘు ఆమెకోసం పరుగెత్తాడు.

ఆమె అతడికి అందకుండా పక్కకు నెడుతూ—

"ఒక్క క్షణం అలా కూర్చోండి—నైట్ డ్రస్సులో వస్తాను. ఆపిల్ పళ్ళు తిందాం—" అంది.

ఒకప్పుడైతే అతడామెను వదిలి ఉండేవాడు కాదు. క్షణంసేపు ఆతను నిగ్రహించుకుని సోఫాలో కూర్చున్నాడు. సోఫాముందున్న టీపాయ్ మీద ఆపిల్ పళ్ళు ఉన్నాయి.

అతను ఆపిల్ పళ్ళవంకే చూస్తున్నాడు. అతడి బుర్ర గజిబిజిగావుంది.

"ఏ పనైనా ఫ్రూట్స్‌తో ప్రారంభించాలంటారు మా డాడీ—" అందామె.

రఘు తలెత్తి చూశాడు. ఆమె నైట్ డ్రెస్సులో వచ్చింది. ఒకనాటి భారతీయుల ప్రతిభావ్యుత్తులను మించిన పనితనం నేటి యంత్రాలకున్నది. ఆమె వంటి మీద ఇప్పుడు నైట్ గౌన్ వున్నది, ఇందాకటిలంగా, జాకెట్లు లేవు. అద్దాల షో కేసులో నిలబడ్డ నగ్న సుందరిలా ఉన్నదామె నైట్ గౌన్‌లో. ఆమె శరీరంలో ఇప్పుడు కనపడని భాగంలేదు.

కళ్ళప్పగించి ఆమెను చూస్తున్నాడు రఘు. అజంతా శిల్పం తనముందు నిలబడిందా అన్న అనుభూతి కలిగిందతడికి. ఎంత అదృష్టవంతుడు తను? ఆ సుందరి తనను కోరుతోంది?

అప్పుడు ఆమె చేయి ముందుకు పెట్టింది. ఆమె చేతిలో కత్తి ఉంది—"పళ్ళు కోయడానికి!" అంది.

స్టెయిన్‌లెస్ స్టీలు కత్తి తళతళ మెరిసింది.

అప్పుడే రఘు బుర్రలో ఏదో తళుక్కుమంది.

ఆ కత్తి పట్టుకుని తన ఎదురుగా నిలబడిన వ్యక్తి శారదలా కనబడిందతనికి. అప్రయత్నంగా అతడికి శారదకు తను కొని ఇచ్చిన బాకు గుర్తుకొచ్చింది. తను తప్పుచేస్తే ఆ బాకుతో శారద తనను పొడవాలని శాసించాడు. లేని పక్షంలో తనే పొడుచుకు చచ్చిపోతానన్నాడు.

కానీ—తనిప్పుడేం చేస్తున్నాడు?

అందుకే శారద—తన పని చేయడానికి వచ్చిందా?

రఘు చటుక్కున లేచి నిలబడి వెనక్కు తిరిగాడు. ఆమె పిలుస్తున్నా వినిపించుకోకుండా గదిలోంచి బైట పడ్డాడు.

## 11

"ఇటీజ్ ఫంటాస్టిక్ స్వరూప్!" అందామె.

"ఏమయింది వాణీ—" అనడిగాడు స్వరూప్.

"జీవితంలో ఇలాంటి పురుషుణ్ని ఎక్కడా చూడ లేదు. ఇట్స్ ఇన్‌క్రెడిబుల్—అతడు ఆ రఘు మనిషి కాదు. దేవుడు. లేకపోతే నేను చేసిన చేష్టలకు నిగ్రహించుకోవడం అసాధ్యం!" అంది వాణి.

"ఏమయింది?" అన్నాడు స్వరూప్.

"నిజానికి నేను సిగ్గుపడుతున్నాను. అతడికి మళ్ళీ ముఖం చూపించలేను. భార్యను తప్ప పరాయి ఆడదాన్ని తను కన్నెత్తి చూడడు—" అంటూ వాణి జరిగింది చెప్పింది.

స్వరూప్ నిరుత్సాహంగా—"శారద ప్రేమ చాలా గొప్పది—ఆమె ప్రేమ కాముకుణ్ని ఏకపత్నీవ్రతుడిగా మార్చింది. నా ప్రేమ సారంహీనం. శారదవంటి అపురూప వ్యక్తికి కూడా నాపై కరుణ కలగలేదు. ఆమె ప్రేమ బలం కారణంగానే నేనామె విషయంలో చేసిన ప్రయత్నాలన్నీ వమ్మయిపోయాయి—" అన్నాడు.

స్వరూప్ నిరుత్సాహానికి అర్థముంది. రఘు స్త్రీలోలత నాధారంగా చేసుకుని అతను యెందరో స్త్రీలను అతడిమీద కుసిగొల్పాడు. ఆ విషయం శారదకు తెలిసే విధంగా ఎలక్ట్రానిక్ వ్యూహాన్ని రూపొందించాడు. దాని ఫలితంగా శారదకు రఘుపైన విరక్తి కలుగుతుందనే

ఆశించాడు కానీ—రఘులో క్రమంగా మార్పువస్తుందని యెన్నడూ ఊహించలేదు.

ఇప్పుడు ఆఖరిసారిగా వాణిని ప్రయోగించాడు.

భార్యకు దూరంగా టూర్లో ఉంటూ కూడా, పరాయి స్త్రీ అర్ధనగ్నంగా సమీపించి చనువిచ్చినా కూడా నిరాకరించే స్థాయికి రఘు ఎదిగిపోయాడు.

ఈ విజయం తన ఎలక్ట్రానిక్ వృక్షానిదా? శారద ప్రేమ బలానిదా?

శారద ఇంక తనకు శాశ్వతంగా దక్కదు. తన ప్రేమ ఉదాత్తమైనదే అయితే ఈ విషయం శారదకు చెప్పాలి. ఆమెకు సంతోషం కలిగించాలి. తక్షణం తను శారదను కలుసుకోవాలి .... స్వరూప్ వాణికి ధన్య వాదాలు చెప్పుకుని అప్పటికప్పుడు శారద యింటికి వెళ్ళాడు.

# 12

"నీకో గొప్ప శుభవార్త!" అన్నాడు స్వరూప్, శారదను చూస్తూనే.

"ఏమిటది?"

"నీ భర్తను నేను పరీక్షించాను. అతను పూర్తిగా మారిపోయాడు—" అంటూ స్వరూప్ ఆమెకు జరిగినదంతా చెప్పాడు.

శారద ఆశ్చర్యంగా—"నిజమని నమ్మమంటావా?" అంది.

"నీమీద ఒట్టు—" అన్నాడు స్వరూప్.

"ఓహ్ స్వరూప్—యిప్పుడు నాకెంత సంతోషంగా వుందో ఎలా చెప్పేది?" అంది శారద ఉత్సాహంగా.

ఆమె ఉత్సాహాన్ని గమనిస్తూ—"రఘు యెంత

అదృష్టవంతుడు?" అనుకుని నిట్టూర్చాడు స్వరూప్.

"రఘు ఇప్పుడేం చేస్తున్నాడో?" అంటూ పూజ గదిలోకి పరుగెత్తింది శారద. ఆమె వెనకనే స్వరూప్ కూడా వెళ్ళాడు.

ఇద్దరూ ఎలక్ట్రానిక్ వింత వృక్షంముందు నిలబడ్డారు. శారద దానివంకే చూస్తూ—"స్వరూప్! ఇది కదలడం లేదేమిటి? పాడయిందా?" అంటూ వెనక్కి వంగి రికార్డరులోని కాగితం తీసింది.

DEAD 3.30 P.M.అని ఉందా కాగితంమీద.

కెవ్వుమని అరిచింది శారద. స్వరూప్ కూడా ఆ చీటీ చదివి బ్రాన్తపడిపోయాడు.

"ఇది నిజమా, నమ్మమంటావా?" అంది శారద అతి కష్టంమీద గొంతు పెగిల్చి.

"నమ్మాలని లేదు నాకు. కానీ యంత్రం అబద్ధమాడదు—" అన్నాడు స్వరూప్. అతడి ఆలోచనల స్వరూపం మళ్ళీ మారుతోంది.

శారదను తను ప్రేమించాడు. కానీ రఘు ఆ ప్రేమకు అడ్డం వచ్చాడు. యిప్పుడా అడ్డు తొలగిపోయింది. శారద ప్రేమకంటె తన ప్రేమ బలమైనది. అందుకే రఘు మరణించి కథను కొత్తమలుపు తిప్పింది.

"అసలేం జరిగి ఉంటుందంటావ్?"

"అతనిలోని మార్పు ఇష్టంలేక ఎవరైనా హత్య చేసి ఉండొచ్చు...." అన్నాడు స్వరూప్.

"లేదు—స్వరూప్! గబ్బిలం వెలుతురు భరించలేదు. దోమలు పరిశుభ్రమైన వాతావరణంలో మనలేవు. రఘు అలాంటివాడే! అతడికి కొన్ని చెడుబుద్ధులున్నాయి. అవే అతడికి ఊపిరిపోసి బ్రతికిస్తున్నాయి. నేనతణ్ణి

సంస్కరించాలనుకున్నాను. అతడిలో మానసిక సంఘర్షణ లేపాను. ఫలితంగా అతడు మారాడు. అయితే తనువు, మనసు కూడా ఆ మార్పును తట్టుకోలేక పోయాయి. అదే చావుకు దారితీసింది. నిజంగా నేనాయన్ను ప్రేమించివుంటే ఆయన్ను మార్చాలని అనుకోకుండా ఉండవలసింది. నా స్వార్థమే ఆయన ప్రాణాలుతీసింది-" అంటూ కూలబడి ఏడ్వసాగిందామె.

ఉన్నట్టుండి స్వరూప్ కు ఏదో గుర్తొచ్చింది — "అవును ఆయన మూడ్రోజులు టూర్ కదా—నువ్వు ఆయనకు ఒక్కసారిగా మూడు చుక్కలు X—Y 8 ఫ్లూరైడ్ ఇచ్చావా?" అన్నాడు.

ఊఁ అన్నట్లు తలూపిందామె.

"నీకు చెప్పడం మర్చిపోయాను. ఒకే ఒక్కసారి ఇంకై చుక్కలకు మించి X—Y 3 ఫ్లూరైడ్ యివ్వకూడదు. ఇస్తే ప్రమాదం వుంది. రియాక్షన్ వచ్చి ఒకోసారి ప్రాణాలు తీయొచ్చు. రియాక్షన్ ఇరవై చుక్కలూ అయిపోయిన మూడోరోజున ప్రారంభం కావచ్చు...." అన్నాడు స్వరూప్.

"మరి ఈ సంగతి నాకు ముందే ఎందుకు చెప్పలేదు?" అంది శారద.

"మరిచిపోయాను...." అన్నాడు స్వరూప్.

"మరిచిపోవడంకాదు. కావాలనే చేశావు. ఇప్పుడు నీ దుష్టబుద్ధి అర్ధమవుతోంది నాకు...." అంది శారద. "అయినా నిన్నని ఏం లాభం—భర్తను అదుపులో పెట్టాలనుకుని—ఆయన్ను పూర్తిగా నావాణ్ని చేసుకోవాలని ఇప్పుడు ఎవరికీకాకుండా చేసేశాను. నాకు బాగా బుద్ధి చెప్పావు—...."

స్వరూప్ వంచిన తల ఎత్తలేదు. కానీ—"అతను చావాలని అనుకున్నాను కానీ, అతన్ని చంపాలని అనుకోలేదు. X–Y 3 ఫ్లూరైడ్ ద్రవం ఆరోగ్యవంతులపై రియాక్షన్ చూపడానికి అవకాశాలు చాలా స్వల్పం. అయితే క్లిష్టమైన మానసిక సంఘర్షణ అనుభవించేవారికి ఎక్కువ డోసు యిచ్చినప్పుడు రియాక్షన్ ఉండవచ్చు. నేను నీకోసం వాటిని అతడిపై ఉపయోగిస్తే—అది అతడిలో కలిగించిన మానసిక సంఘర్షణ ఇంతా అంతా కాదనుకుంటాను. అదే అతడి ప్రాణాలు తీసింది. ఇది పూర్తిగా నా తప్పు—" అని నెమ్మదిగా అన్నాడు.

స్వరూప్ కి నిజంగా చాలా బాధగావుంది. తనకు తెలియకుండా తను రఘుని హత్య చేశాడు. ఈ హత్య తనను జీవితాంతమూ వెంటాడుతుంది.

తను ఇంక శారద ముఖం ఎలా చూస్తాడు?

స్వరూప్ సమస్య చాలా సులభంగా తేలిపోయింది. రఘు తనకిచ్చిన బాకుతో ఆమె ఆత్మహత్య చేసుకుని మరో లోకంలోని రఘుని వెతుక్కుంటూ వెళ్ళిపోయిన వార్త మర్నాడే చేరింది.

—:ఐపోయింది:—